

సీఎంఆర్‌ఎఫ్ చెక్‌లను అందజేసిన ఎమ్మెల్యే మాగంటి

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్యం

బోరబండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలకు చెందిన 18మంది లబ్ధిదారులకు రూ.8.91.500 విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్‌లను మధురానగర్‌లో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణమోహన్, విజయ్‌కుమార్, ఆనంద్, బాబానాయక్, యూసుఫ్ పాల్గొన్నారు.



స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

బోరబండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ ప్రజలకు సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఎస్పార్టీ నగర్‌లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడారు. గత నెలలో కురిసిన వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ కవిత, సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ భరత్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

వరదతో దెబ్బతిన్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టండి

బంజారాహిల్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వరద కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేశారు. గత నెలలో కురిసిన వర్షం కారణంగా ఫిలింనగర్ బండారు బాల్‌రెడ్డినగర్‌లో రోడ్డుపై రాళ్లు తేలి నడవటానికి వీలు లేకుండా మారిందని కార్పొరేటర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మిగతా బస్తీల్లో కూడా పెండింగ్ పనులు అనేకం ఉన్నాయని వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.



కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్



డిజైనర్ వేర్‌ను చూపిస్తున్న స్టాల్ యజమానులు

ఆకట్టుకుంటున్న కళా సిల్క్స్ డిజైన్లు

అల్లాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చేనేత కళాకారులను ప్రోత్సహించే సంకల్పంతో 'కళాసిల్క్స్ సొసైటీ' మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వివిధ శుభకార్యాలకు అవసరమయ్యే అన్ని రకాల వస్తువులు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. మహిళల కోసం ప్రత్యేకంగా వివిధ మోడళ్లలో ఆధునిక వస్తువులు, గృహోపకరణాలు, హస్త కళారూపాలు, బొమ్మలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు పోచంపల్లి, ఉప్పాడ, బెనారస్, భాగల్పూర్ సిల్క్, వన్‌గ్రాం గోల్డ్ జువెల్లరీ, బెంగాల్ కాటన్ శారీస్, జైపూర్ కుర్తీస్, హరియాణా బెడ్ షీట్స్, హైదరాబాద్ ముత్యాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకూ ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎగ్జిబిషన్ ప్రతినిధి వికాస్‌జైన్ సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. 11కేవీ ఉడ్స్ అపార్ట్‌మెంట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, 11కేవీ ఆరోగ్యశ్రీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.45 గంటల వరకు, 11కేవీ గాయత్రి హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 గంటల వరకు, 11కేవీ యూసుఫ్‌గూడ పోలీస్ లైన్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు, 11కేవీ గ్రీన్ బంజారాకాలనీ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

ఎఫ్ఏబీప ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సమ్మిట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): లైఫ్‌సైన్స్ రంగంలో లేటెస్ట్ అప్డేట్స్‌పై అవగాహన కల్పించేందుకు ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్ (ఎఫ్ఏబీఏ) ఆధ్వర్యంలో నగరంలో ఇన్నోవేషన్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రొఫెసర్ పి.రెడ్డన్న తెలిపారు. సోమాజిగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా అంత్రప్రెన్యూర్స్ చైర్మన్ చక్రవర్తితో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 16న డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, 17న వేల్‌ట్యాంక్, 18 లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ క్లస్టర్ మీట్‌ను కలిపి మొత్తం మూడు ఈవెంట్లు హైదరాబాద్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ రంగంలో విస్తృత సేవలు అందించిన వారికి బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిల్ షరీఫ్

ఉద్యోగులకు ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

ఖైరతాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు త్వరగా వచ్చేలా చొరవ చూపుతామని ఐఎన్‌టీయూసీ అనుబంధ సహకార మజ్దూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొందరు ఉద్యోగులు ఐఎన్‌టీయూసీలో చేరారు. అనంతరం ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో ఉద్యోగులు, కార్మికులను వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కె.రమేష్, ఖైరతాబాద్ జోన్ అధ్యక్షుడు మల్లికార్జున్, కార్యదర్శి కృష్ణ, ప్రతినిధులు గోవింద్, బాలమురళి, మోహన్, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ ప్రారంభమెప్పుడో..?

- 9 నెలలుగా స్థానికుల ఎదురుచూపులు



ప్రారంభానికి నోచుకోని తుమ్మలబస్తీ కమ్యూనిటీ హాలు

ఖైరతాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులు లక్షల రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. తుమ్మలబస్తీలో సమైక్య భారతి యూత్ అసోసియేషన్ కోసం గతంలో ఉన్న నిర్మాణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపగా రూ.19.98 లక్షలు ఎమ్మెల్సీ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 2023 ఏప్రిల్‌లో నిర్మాణం ప్రారంభించగా గత దసరాకు ముందే నిర్మాణం పూర్తయ్యింది. 9 నెలలుగా దీనిని ప్రారంభించేందుకు స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సమయం ఇవ్వడం లేదు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అనంతరం ప్రారంభోత్సవానికి ముహూర్తం నిర్ణయించి శిలాఫలకాన్ని సిద్ధం చేసినా.. అదే తేదీన స్థానిక ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికార పార్టీలోకి ఢిల్లీలో చేరడంతో ఆ రోజున కూడా ప్రారంభం జరగలేదు. ప్రజా ప్రతినిధులు ప్రారంభించకున్నా ప్రజల అవసరాలకు వినియోగించుకునేలా అనుమతివ్వాలని స్థానికులు కోరుతున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్మెల్యే వచ్చి ప్రారంభించిన తర్వాతే దానిని వినియోగిస్తామని భీష్మించుకు కూర్చున్నారు. ఎమ్మెల్యే సమయమిచ్చేదెన్నడు, కమ్యూనిటీ హాలు ప్రారంభమయ్యేదెన్నడు అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ హాలు నిర్మాణంలో వినియోగించిన తలుపులకు చెదలు పట్టి పాడైపోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ కార్యాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి ఈ కమ్యూనిటీ హాలును ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సభ్యులు



ప్రభుత్వ ముద్రణాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఉద్యోగుల జేఏసీ నేత ఈశ్వరయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్, అధికారులు శాంతికుమారి, సంతోష్‌కుమార్, విజయ్‌కుమార్, బాల్‌కుమార్ తదితరులు - ఖైరతాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి

పంజాగుట్ట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బతికున్నంత కాలం అలుపెరగకుండా కృషి చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుతో స్వపరిపాలన, సుపరిపాలన సాధ్యమని ప్రజలను చైతన్యపరిచిన దార్శనికుడు జయశంకర్ అని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కమిషన్ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, కె.కిషోర్ గౌడ్, అసిస్టెంట్ సెక్రెటరీ జి.సతీష్, ఓఎస్డీ కె.తులసిరామ్, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఎల్‌జీబీటీక్యూలకు బాసటగా ఉన్నత న్యాయస్థానం'

పంజాగుట్ట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): లెస్బియన్, గే, ద్విలింగ, లింగమార్పిడి, క్వీర్ (ఎల్‌జీబీటీక్యూ)లకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం బాసటగా నిలవడం హర్షణీయమని క్వీర్ నిలయం వ్యవస్థాపకుడు జయంత్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాది హేమాలలితతో కలిసి ఆయన మాట్లాడారు. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన 26 ఏళ్ల యువతి, తెలంగాణకు చెందిన మరో యువతితో పరస్పర అంగీకారంతో సహజీవనం చేసే వారని తెలిపారు. ఇది ఇష్టంలేని తెలంగాణకు చెందిన యువతి తల్లిదండ్రులు తమ కూతురిని బలవంతంగా తీసుకెళ్లి వాళ్ల ఇంట్లో బంధించారని తెలిపారు. ఇదే విషయమై జైపూర్‌కు చెందిన యువతి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు వారిద్దరూ మేజర్లు కావడంతో తమకు ఇష్టం ఉంటే ఒకే దగ్గర జీవించవచ్చునని తీర్పు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా తమ జీవన నిర్ణయాలను తీసుకోవడానికి హక్కును కల్పించిన అత్యున్నత న్యాయస్థానం తీర్పును తాము స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో క్వీర్ నిలయం ప్రతినిధులు నగినా, దీప్తి, లైలీ, తెలంగాణ ట్రాన్స్‌జెండర్ జేఏసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సంజీవయ్య పార్కు వద్ద విద్యార్థులకు మొక్కల పంపిణీ చేస్తున్న దృశ్యం

హెచ్ఎండీఏ మొక్కల పంపిణీ షురూ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం హెచ్ఎండీఏ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మొక్కల పంపిణీని ప్రారంభించారు. దాదాపు 45 నర్సరీల నుంచి కోటి మొక్కలను ఉచితంగా పంపిణీ చేయాలని అర్బన్ ఫారెస్టు విభాగం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం హెచ్ఎండీఏ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలలో మొక్కలను పంపిణీ చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేసి అమల్లోకి తీసుకొచ్చింది. వివిధ పార్కుల వద్ద, ఔటర్ రింగ్‌రోడ్డు టోల్‌బూత్‌ల వద్ద మొక్కలను ఉచితంగా అందజేశారు. వాహనాలను ఏర్పాటు చేసి కాలనీల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్ఎండీఏ నర్సరీల్లో అనేక రకాల పూలు, పండ్ల జాతుల మొక్కలు ఉన్నాయని, ముఖ్యంగా బంతి, మందార, మల్లె, ఎగ్జోరా, గ్లుమెరియా పూల మొక్కలు, నేరడు, జామ, దానిమ్మ, పనస తదితర పండ్ల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

'క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి'

పంజాగుట్ట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని తెలంగాణ ట్యాక్సీ డ్రైవర్స్ జేఏసీ కోశాధికారి కిరణ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లపై దాడులు పెరిగాయని, ఫిర్యాదు చేసినా సంబంధిత విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెండు సంవత్సరాల క్రితం రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో వెంకటేష్‌గౌడ్ అనే క్యాబ్ డ్రైవర్‌పై సుమారు 20మంది విచక్షణారహితంగా దాడిచేయడంతో కోమాలోకి వెళ్లి ఇటీవల ఆయన మృతిచెందారని తెలిపారు. ఆయన చికిత్స కోసం కుటుంబసభ్యులు సుమారు రూ.1.40కోట్లు ఖర్చు చేసినా ఫలితం దక్కలేదన్నారు. తాజాగా రాంనగర్‌లో ఓ క్యాబ్ డ్రైవర్‌పై ఎనిమిది మంది దాడిచేయగా, తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఇలాంటి ఘటనల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆయన కోరారు. యాప్ బేస్డ్ కంపెనీలు తమను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నాయని, వారికి కమిషన్‌లు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. డ్యూటీలో చనిపోతే ఐదు లక్షల నుంచి పది లక్షల రూపాయల వరకు పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు వెంకటేష్‌గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి క్యాబ్ డ్రైవర్లను స్వయంగా పిలిపించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని, మీటర్ రీడింగ్ విధానం తీసుకువస్తామని హామీ ఇచ్చారని, దానిని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. క్యాబ్ డ్రైవర్లు, మహిళా ప్రయాణికుల కోసం డ్యాష్ క్యామ్ విధానాన్ని తీసుకురావాలన్నారు. ఇతర రాష్ట్రాల వాహనాలను ఇక్కడ నడపడం వల్ల తాము నష్టపోతున్నామని, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వాటిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు సంతోష్‌గుప్తా, రవూఫ్, నంద, సురేశ్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో కేబుల్ వైర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలి

- కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే విద్యుత్ శాఖ కుట్ర
- తెలంగాణ కేబుల్ టీవీ అండ్ ఇంటర్నెట్ సర్వీసెస్ ప్రొవైడర్స్ అసోసియేషన్

బర్కత్‌పుర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ గ్రేటర్ పరిధిలోని విద్యుత్ స్తంభాలకున్న కేబుల్ వైర్లను తొలగిస్తూ వాటిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాదిమంది కుటుంబాలను వీధిపాలు చేస్తున్నదని తెలంగాణ కేబుల్ టీవీ అండ్ ఇంటర్నెట్ సర్వీసెస్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆరోపించింది. కేబుల్ వైర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డేగల సతీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఉపాధ్యక్షులు సలీమ్ మాట్లాడారు. ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా విద్యుత్ శాఖ అధికారులు గ్రేటర్ పరిధిలోని ఈసీఐఎల్, బండ్లగూడ, మాదాపూర్, లాలాగూడ, బేగంపేటతో పాటు పలు ప్రాంతాలలో కేబుల్ టీవీ వైర్లను తొలగించారని, దీనివల్ల కేబుల్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయి ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలను రూపొందిస్తే తాము విద్యుత్ స్తంభాలకు ట్యాక్స్ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, చెన్నై తరహాలో కేబుల్ వ్యవస్థను తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇంటర్నెట్ వ్యవస్థ కేబుల్ వినియోగదారులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జైపాల్, పూర్ణచందర్, శివాజీ, రమణ, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో కరపత్రాలను చూపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

విదేశాల్లో ఉద్యోగం పేరిట మోసం

- న్యాయం చేయాలంటూ బాధితుల ఆందోళన

బంజారాహిల్స్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్యారిస్‌లో మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రవేశానికి తాము చెల్లించిన డబ్బులు రీఫండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత విద్యార్థులు మంగళవారం బంజారాహిల్స్ అరోరా కాలనీలోని ఫ్రాన్స్ క్యాంపస్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ కోసం మొత్తం 22 మంది విద్యార్థులు ఒక్కొక్కరు రూ.5 లక్షల చొప్పున ఎస్ ల్యాప్ ప్యారిస్ కాలేజీలో అడ్మిషన్ కోసం కట్టామని పలు కారణాల వల్ల 21 మంది విద్యార్థులకు వీసా రద్దయ్యిందని తెలిపారు. వీసా రద్దయిన 45 రోజుల్లోపు తమ ఖాతాల్లో నగదు జమ కావాల్సి ఉన్నా కాలేదని వారు తెలిపారు. ఇదే విషయమై పలుమార్లు యూనివర్సిటీ వారిని సంప్రదించగా 16 మంది విద్యార్థులకు 50 శాతం మేర రీఫండ్ చేశారని, ఇంకా ఐదుగురు విద్యార్థులకు పూర్తిస్థాయిలో మిగతా వారికి 50 శాతం మేర సుమారుగా రూ.60 లక్షల వరకు రావాల్సి ఉందని తెలిపారు. పలుమార్లు వారికి మెయిల్ పెట్టినా కూడా స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఫ్రెంచ్ ప్రభుత్వ పెద్దలకు కూడా తాము మెయిల్స్ పెడుతున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలకాని సురేష్, కరీముల్లా, సయ్యద్ అబ్దుల్ హమీద్, ఇంతియాజ్, షేక్ హబీబుల్లా, వసీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్రాన్స్ క్యాంపస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధిత విద్యార్థులు



గణేశ్ నవరాత్రి ఉత్సవాల కోసం ఖైరతాబాద్‌లో శరవేగంగా సిద్ధమవుతున్న బడా గణేశుడు - ఫొటో: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఆంజనేయ స్వామికి వడమాల అలంకరణ

బంజారాహిల్స్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పదకొండు వేల నూట పదహారు వడలతో అలంకరించిన ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14 లోని నందినగర్ శ్రీ ఆంజనేయ స్వామిని ఆలయ అర్చకులు శ్రావణ మాసం తొలి మంగళవారం సందర్భంగా వడమాలలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శేష శైలాచార్యులు, కిరణ్ కుమారాచార్యులు మాట్లాడారు. ప్రతియేటా శ్రావణమాసంలో వచ్చే ప్రతీ మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా స్వామి వారిని దివ్యంగా అలంకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దశరథ తదితరులు పాల్గొన్నారు.



వడమాల అలంకరణ అనంతరం పూజాధికాలు నిర్వహిస్తున్న అర్చకులు

బండరాయితో వ్యక్తి తలపై దాడి

బేగంపేట ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వివాదం దాడికి దారితీసింది. ఈ సంఘటన బేగంపేటలోని మాతాజీనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మాతాజీనగర్‌లో అదే బస్తీకి చెందిన చెరుకుబండి సాయిలు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అక్కడే ఉన్న యాదగిరి కారును ఢీకొంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. సాయిలు తన కుమారుడు శ్రీనివాస్‌కు విషయం చెప్పడంతో ఆయన వచ్చి యాదగిరితో గొడవకు దిగాడు. ఆవేశానికి గురైన శ్రీనివాస్ బండరాయితో యాదగిరిపై దాడి చేయడంతో తల పగిలింది. తీవ్ర గాయాలైన యాదగిరిని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.

పోలీసులకు మస్కా కొట్టి పారిపోయిన దొంగ

- మూడు రోజుల వ్యవధిలో రెండుసార్లు..

బంజారాహిల్స్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గంజాయికి అలవాటుపడి డబ్బు కోసం నల్లాలు, మ్యాన్‌హోల్ మీద మూతలు దొంగలించే ఓ దొంగ మూడు రోజుల వ్యవధిలో రెండుసార్లు పోలీసులకు మస్కా కొట్టి పారిపోయాడు. యూసుఫ్‌గూడ సమీపంలోని యాదగిరినగర్‌లో కొద్ది రోజులుగా మంచినీటి నల్లాలు, డ్రైనేజీ కవర్లు మూతాలు మాయం అవుతున్నాయి. దీంతో బస్తీ వాసులు సీసీ కెమెరాలను పరిశీలించి వికాస్ అనే వ్యక్తి ఎత్తుకెళ్తున్నట్లు గుర్తించారు. మూడు రోజుల పాటు కాపు కాసి వికాస్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని మధురానగర్ పోలీసులకు అప్పగించారు. అతనిపై దొంగతనం కింద కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వికాస్ పోలీసుల కళ్లు గప్పి స్టేషన్ నుంచి తప్పించుకున్నాడు. అతని కోసం పోలీసులు ప్రత్యేకంగా రెండు బృందాలను రంగంలోకి దించారు. ఇదిలా ఉండగా జూబ్లీహిల్స్‌లో వికాస్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ఈనెల 5న మధురానగర్ పోలీసులకు అప్పగించారు. క్రైం విభాగంలో ఐదుగురు కానిస్టేబుళ్ల రక్షణలో ఉన్న వికాస్ అందరిని మాటల్లో పెట్టి మరోసారి తప్పించుకున్నాడు. ఈ వ్యవహారంపై మధురానగర్ పోలీసులపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా తప్పించుకున్నాడా..? లేదా తప్పించబడ్డాడా..? అనే కోణంలో విచారణ చేయాలని ఏసీపీని ఆదేశించారు. వికాస్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బజారాహిల్స్‌లో విద్యార్థి అదృశ్యం

బంజారాహిల్స్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చదువు మానేసి పనిచేస్తానని స్నేహితులతో చెప్పిన ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఢిల్లీకి చెందిన నూర్జహాన్ కార్తున్ కుటుంబంతో కలిసి మూడు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 ఎన్‌బీటీనగర్‌లో నివాసముంటున్నారు. ఆమె కుమారుడు జనతుల్లాహి(16) పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల బాలుడు చదువు మీద శ్రద్ధ పెట్టకపోవడంతో తల్లి మందలించింది. ఈనెల 5న సాయంత్రం జనతుల్లాహి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. దీంతో తల్లి అతని స్నేహితులను సంప్రదించగా చదువు మానేసి పనిచేస్తానని చెప్పి వెళ్లిపోయాడని చెప్పారు. జనతుల్లాహి కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనం తీయమన్న దంపతులపై దాడి

బంజారాహిల్స్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనం తీయమన్నందుకు ముగ్గురు యువకులు కర్రలతో దంపతులపై దాడి చేశారు. ఈ నెల 5న ఇందిరానగర్‌కు చెందిన మమత భర్త రవి ఇద్దరు కుమార్తెలతో కలిసి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి వస్తుండగా ఇందిరానగర్‌లో రోడ్డుకు అడ్డంగా ఓ వాహనం ఉంది. వాహనం అడ్డుతీయమని మమత కోరగా అక్కడే ఉన్న షఫీ, షారుక్, గోపీ ఆమెను దుర్భాషలాడారు. దీంతో మాటా మాటా పెరిగి రవి, మమతను కర్రలతో కొట్టారు. తీవ్ర గాయాలు కావడంతో మమత బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి గొలుసు చోరీ

బంజారాహిల్స్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు ఎక్కిన ఐదుగురు గలాట సృష్టించారు. అనంతరం ఓ వ్యక్తి మెడలో ఉన్న గొలుసు అపహరించారు. గాజులరామారానికి చెందిన వానపల్లి బ్రహ్మాజీ సినీ పరిశ్రమలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 5న పనిమీద అమీర్‌పేటకు వచ్చాడు. అక్కడి నుంచి శ్రీనగర్‌కాలనీలో ఉండే కార్యాలయానికి ఆర్టీసీ బస్సు ఎక్కాడు. అదే బస్సు ఎక్కిన ఐదుగురు మద్యంమత్తులో హడావిడి చేశారు. అతన్ని దుర్భాషలాడారు. ఇంతలో దిగాల్సిన స్టాప్ రావడంతో బ్రహ్మాజీ బస్సు దిగి కార్యాలయానికి వెళ్లి చూసుకోగా మెడలో గొలుసు కనిపించలేదు. బస్సులో ఉన్న వ్యక్తులే తన 18 గ్రాముల బంగారు గొలుసు అపహరించారని బ్రహ్మాజీ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్ సహాయకుడి అదృశ్యం


తులేశ్వర్ పాటిల్

తిరుమలగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్‌లో లారీ డ్రైవర్ సహాయకుడు అదృశ్యం అయిన సంఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్‌కు చెందిన వేద్‌ప్రకాష్‌సాహు బోయిన్‌పల్లి మార్కెట్‌కు లారీలో కూరగాయలు తీసుకువస్తుంటాడు. ఇతనితోపాటు సహాయకునిగా తులేశ్వర్ పాటిల్ జూలై 31న వచ్చాడు. అయితే లారీలో నుంచి కూరగాయలు దింపిన అనంతరం తులేశ్వర్ బయటకి వెళ్లాడు. ఎంతకూ రాకపోవడంతో చత్తీస్‌గఢ్‌కు వెళ్లిపోయి వుండవచ్చని వేద్‌ప్రకాష్ కూడా లారీని తీసుకుని చత్తీస్‌గఢ్‌కు వెళ్లిపోయాడు. అక్కడ వారి కుటుంబసభ్యులను విచారించగా తులేశ్వర్ రాలేదని కుటుంబ సభ్యులు సమాధానం ఇచ్చారు. దీంతో వేద్‌ప్రకాష్ సాహు తిరిగి సికింద్రాబాద్‌కు చేరుకొని తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ వైర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలి

● కేబుల్ టీవీ అండ్ ఇంటర్నెట్ సర్వీసెస్ ప్రొవైడర్స్ అసోసియేషన్

బర్కత్‌పుర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ గ్రేటర్ పరిధిలోని విద్యుత్ స్తంభాలకున్న కేబుల్ వైర్లను తొలగిస్తూ వాటిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కుటుంబాలను వీధిపాలు చేస్తున్నదని తెలంగాణ కేబుల్ టీవీ అండ్ ఇంటర్నెట్ సర్వీసెస్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆరోపించింది. కేబుల్ వైర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేగల సతీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఉపాధ్యక్షులు సలీమ్ మాట్లాడుతూ.. ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా విద్యుత్ శాఖ అధికారులు గ్రేటర్ పరిధిలోని ఈసీఐఎల్, బండ్లగూడ, మాదాపూర్, లాలాగూడ, బేగంపేటతోపాటు పలు ప్రాంతాలలో కేబుల్ టీవీ వైర్లను తొలగించారని, దీనివలన కేబుల్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయి ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను రూపొందిస్తే తాము విద్యుత్ స్తంభాలకు ట్యాక్స్ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, చెన్నై తరహాలో కేబుల్ వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇంటర్నెట్ వ్యవస్థ కేబుల్ వినియోగదారులకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జైపాల్, పూర్ణచందర్, శివాజీ, రమణ, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ వాహనాల దొంగ అరెస్ట్

మారేడుపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని కార్ఖానా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కార్ఖానా సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం బోరబండకు చెందిన సోహెల్ (29) హైటెక్ సిటీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడి ఈజీమనీ కోసం ద్విచక్రవాహనాల దొంగతనాలకు అలవాటుపడ్డాడు. ఏఓసీ సెంటర్ వద్ద విజయ్ అనే కర్రీసెంటర్ వ్యాపారి ఈనెల 3న అర్థరాత్రి సమయంలో ద్విచక్రవాహనాన్ని దుకాణం ఎదుట పార్క్ చేసి ఇంటికి వెళ్లాడు. పార్క్ చేసిన వాహనాన్ని సోహెల్ దొంగలించాడు. ఈనెల 6న డైమండ్ పాయింట్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా సోహెల్ దొంగిలించిన వాహనంతో పట్టుబడ్డాడు. పొంతన లేని సమాధానం రావడంతో అనుమానం వచ్చిన పోలీసులు అతడిని స్టేషన్‌కు తరలించి విచారించగా వాహనం దొంగిలించినట్లు ఒప్పుకొన్నాడు. నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దాదాపు 14 కేసుల్లో నిందితుడని పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించారు.

డబ్బుల విషయంలో ఘర్షణ

● ఒకరికి కత్తిపోట్లు, తీవ్రగాయాలు

బోయిన్‌పల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఓ పార్సిల్ సంస్థలో పనిచేసే ఇద్దరు వ్యక్తులు ఆర్థిక లావాదేవీల కారణంగా గొడవపడ్డారు. క్షణికావేశంలో ఒక వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేయడంతో గాయపడ్డాడు. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్‌ఐ శివశంకర్ వివరాల ప్రకారం.. వనపర్తి సమీపంలోని సవాయిగూడెం జమ్ముల తండాకు చెందిన నానావత్ శివ(27), ధర్మానాయక్ (29)లు ఓల్డ్ బోయిన్‌పల్లిలోని ఓ ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పనిచేస్తున్నారు. ఇటీవల ధర్మానాయక్ డబ్బులు కావాలని శివను కోరగా లేవని బదులిచ్చాడు. దీంతో చేసేది లేక బయట రుణం తీసుకున్నాడు. మూడు నెలలుగా కిస్తీలు చెల్లించని విషయం శివకు తెలియడంతో ధర్మానాయక్ ఆగ్రహంతో ఊగిపోయి రెండురోజుల కిందట గొడవచేశాడు. సోమవారం పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరగగా, కోపోద్రిక్తుడైన ధర్మానాయక్ శివపై కత్తితో దాడిచేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఇరువురిపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

హుండీ చోరీ నిందితుల అరెస్టు

తిరుమలగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ఎస్‌బీహెచ్ కాలనీలోని శ్రీనల్లపోచమ్మ దేవాలయంలో హుండీని పగులగొట్టి సొత్తును ఎత్తుకెళ్లిన నిందితులను తిరుమలగిరి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతనెల 30న దేవాలయంలోని హుండీని పగులగొట్టి సొత్తును ఎత్తుకెళ్లిన సంఘటన విదితమే. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తిరుమలగిరి ఇన్‌ఫ్యాంట్ జీజస్ కాలనీకి చెందిన శశాంక్ (21) అల్వాల్‌కు చెందిన ఉదయ్ (22)ను అరెస్టు చేసి 12వేల రూపాయలను వారినుంచి స్వాధీనం చేసుకుని శశాంక్‌ను రిమాండ్‌కు తరలించారు. ఉదయ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా, అతని కాలు విరిగింది. దీంతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను పూర్తిగా కోలుకోగానే అరెస్టు చేసి రిమాండ్ చేస్తామని తిరుమలగిరి పోలీసులు తెలిపారు.

ఎఫ్ఏబీఏ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సమ్మిట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): లైఫ్‌సైన్స్ రంగంలో లేటెస్ట్ అప్డేట్స్‌పై అవగాహన కల్పించేందుకు ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్ (ఎఫ్ఏబీఏ) ఆధ్వర్యంలో నగరంలో ఇన్నోవేషన్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రొఫెసర్ పి.రెడ్డన్న తెలిపారు. సోమాజిగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా ఆంత్రప్రెన్యూర్స్ చైర్మన్ చక్రవర్తితో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 16న రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, 17న వేల్‌ట్యాంక్, 18 లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ క్లస్టర్ మీట్‌ను కలిపి మొత్తం మూడు ఈవెంట్లు హైదరాబాద్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ రంగంలో విస్తృత సేవలు అందించిన వారికి బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.


మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

ఎస్సీ డిక్లరేషన్ హామీని నెరవేర్చాలి

● సికింద్రాబాద్ ఎస్సీ మోర్చా కన్వీనర్ శంకర్‌రావు

అడ్డగుట్ట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎస్సీ డిక్లరేషన్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సికింద్రాబాద్ ఎస్సీ మోర్చా కన్వీనర్ శంకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఎస్సీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని కోరుతూ బీజేపీ నేతలు కలిసి మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ డిక్లరేషన్ ఇచ్చిన ప్రధాన హామీలైన అంబేడ్కర్ అభయహస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణాలు, షెడ్యూల్ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పునర్‌నిర్మాణం అంశాలకు రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించకపోవడాన్ని వ్యతిరేకిస్తున్నాం. అంబేడ్కర్ అభయహస్తం ప్రతి కుటుంబానికి రూ.12లక్షలు ఆర్థిక సహాయం, ఎస్సీ కులాలకు కార్పొరేషన్లకు రూ.750కోట్లు, ఎస్సీ కుటుంబానికి శాశ్వత ఇల్లు నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం, ఎస్సీ హాస్టల్ పునర్నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలి, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు స్వయం ఉపాధికి సబ్సిడీ ఏడాదికి రూ.1000కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. బీజేపీ సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, సికింద్రాబాద్ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ గౌడ్, మహాకాళి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజు, శారదమల్లేష్ పాల్గొన్నారు.

పంద్రాగస్టు తర్వాత..

నగరాభివృద్ధిపై సమీక్ష

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

బౌద్ధనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం హైదరాబాద్ అని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని గ్రేటర్ ప్రగతికి ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. మంగళవారం బౌద్ధనగర్ డివిజన్ పార్శిగుట్ట న్యూఅశోక్‌నగర్ కమ్యూనిటీహాల్‌పై నూతనంగా నిర్మించిన రెండో అంతస్తును ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడారు.

హైదరాబాద్ అంటే హైటెక్‌సిటీ, మాదాపూర్, కొండాపూర్ కాకుండా నిజమైన బస్తీలు, పాతబస్తీలో మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, మురికినీటి కాల్వలు, పార్కులను మెరుగుపర్చాలి. వీటిపై దృష్టి కేంద్రీకరించాలని సీఎంను కోరుతున్నా. పంద్రాగస్టు తర్వాత హైదరాబాద్ అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తాం. నత్తనడకన సాగుతున్న పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం. జీహెచ్ఎంసీ, జలమండలి, రైల్వే, మైనార్టీ తదితర విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరవుతారు' అని పేర్కొన్నారు.


మహిళలకు మొక్కను పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఉపకమిషనర్ సుభాష్‌రావు తదితరులు

బీజేపీ సికింద్రాబాద్ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహాకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్, ముఖ్యనాయకులు మేకల కీర్తి, రాజశేఖర్‌రెడ్డి, కనకట్ల హరి, ప్రభుగుప్తా, శారదామల్లేష్, మద్దెర్ల శ్యామ్‌సుందర్, రాజేశ్వరరావు, సాయిదత్తు, సత్యనారాయణ, బబ్లూలతోపాటు కార్పొరేటర్లు కంది శైలజ, సుప్రియనవీన్‌గౌడ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

'స్వచ్ఛదనం-పచ్చదనం'లో భాగంగా కేంద్రమంత్రి మహిళలకు మొక్కలు అందజేశారు. సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ సుభాష్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఈ శశికాంత్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి


ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం నాయకులు


అడ్డగుట్ట కూడలి వద్ద జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న డివిజన్ కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

సికింద్రాబాద్, రాంగోపాల్‌పేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించడంలో కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కర్‌చారి అన్నారు. సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘం భవనం హాలులో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యక్షులు కటకం చక్రపాణి, నాయకులు బొరంపేట వీరాచారి, కార్వాన్ వీరాంజనేయులు, కాసాల సంపత్‌రాజ్, నారోజు స్వామి, పొన్నాల నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.


డౌటన్ బజారులోని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న గజ్జెల నాగేష్

తిరుమలగిరిలో..

తిరుమలగిరి : బొల్లారం డౌటన్ బజార్‌లోని జయశంకర్ విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ ఏర్పాటు కోసం ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, పొలం నాగేష్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రావుల సతీష్, శేఖర్, శత్రు, శ్రీనివాస్, శివ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట : ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం అడ్డగుట్ట డివిజన్‌లోని పలు కూడళ్ల వద్ద జయశంకర్ చిత్రపటానికి అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి పూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లింగాని శ్రీనివాస్, పలువురు నేతలు పాల్గొన్నారు.

చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేయొద్దు

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనల పేరుతో చిరు (ఫుట్‌పాత్) వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయొద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మోండా మార్కెట్ డివిజన్ పరిధిలోని మోండా మార్కెట్, ఓల్డ్ గాంధీ హాస్పిటల్, ఓల్డ్ జైల్‌ఖానా తదితర ప్రాంతాలకు చెందిన పలువురు చిరువ్యాపారులు (హాకర్స్) మంగళవారం వెస్ట్‌మారేడుపల్లిలోని ఆయన నివాసం వద్ద కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఎన్నో సంవత్సరాలుగా చిన్నచిన్న వ్యాపారాలను చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ ట్రాఫిక్ పోలీసులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని వారు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరారు. స్పందించిన ఆయన వెంటనే మోండా మార్కెట్ ట్రాఫిక్ సీఐకి ఫోన్ చేసి హాకర్స్‌ను ఇబ్బందులకు గురిచేయవద్దని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని హాకర్స్‌ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హాకర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మేకల అశోక్, శివ, గోవర్ధన్, రాజు, అల్తాఫ్, బబ్లు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి సమస్యలను వివరిస్తున్న హాకర్స్ అసోసియేషన్ సభ్యులు


ప్రొ.లక్ష్మీనారాయణకు వినతిపత్రం ఇస్తున్న ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి తదితరులు

ఓయూలో విద్యార్థులకు పెట్టిన డెడ్‌లైన్‌లను ఎత్తివేయాలి

● ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి రవి

తార్నాక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధన చేస్తున్న పరిశోధనా విద్యార్థులకు తమ పరిశోధనలను వెంటనే పూర్తిచేయాలని డెడ్‌లైన్‌లు పెట్టడం యూజీసీ నింబంధనలకు విరుద్ధమని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి అన్నారు. పరిశోధనా విద్యార్థులకు పెట్టిన డెడ్‌లైన్‌లను ఎత్తివేయాలని కోరుతూ ఓయూ జేఏసీ విద్యార్థి నాయకులు మంగళవారం ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ ఓయూలో పరిశోధనా విద్యార్థులు వారికున్న సమయాన్ని సరిగ్గా ఉపయోగించుకుని తమ పరిశోధనలు పూర్తిచేసుకుంటారని, అంతేగాని విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బుధవారం వర్సిటీలో జరిగే ఈసీ సమావేశంలో వర్సిటీ అధికారులు ఓయూ పాలకమండలి సభ్యులతో సుదీర్ఘంగా చర్చించి డెడ్‌లైన్‌లు పెట్టే సంస్కృతిని ఎత్తివేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.


ఉచిత వైద్య శిబిరంలో చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జి వీరయ్యతోపాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్‌కుమార్ తదితరులు

సికింద్రాబాద్ సివిల్ కోర్టులో ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సివిల్ కోర్టులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం కార్యక్రమానికి సికింద్రాబాద్ సివిల్ కోర్టు ఫస్ట్ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జి వీరయ్యతోపాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సుశీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు వైవీ.రమణ, సీనియర్ న్యాయవాది పుష్పలతతో పాటు రెండు వందల మంది న్యాయవాదులకు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు స్క్రీనింగ్ కార్డియాక్, వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.


సంజీవయ్య పార్కు వద్ద మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

హెచ్ఎండీఏ మొక్కల పంపిణీ షురూ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం హెచ్ఎండీఏ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మొక్కల పంపిణీని ప్రారంభించారు. దాదాపు 45 నర్సరీల నుంచి కోటి మొక్కలను ఉచితంగా పంపిణీ చేయాలని అర్బన్ ఫారెస్టు విభాగం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం హెచ్ఎండీఏ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలలో మొక్కలను పంపిణీ చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేసి అమల్లోకి తీసుకొచ్చింది. వివిధ పార్కుల వద్ద, ఔటర్ రింగ్‌రోడ్డు టోల్‌బూత్‌ల వద్ద మొక్కలను ఉచితం అందజేశారు. వాహనాలను ఏర్పాటుచేసి కాలనీల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.హెచ్ఎండీఏ నర్సరీల్లో అనేక రకాల పూలు, పండ్లజాతుల మొక్కలున్నాయని, ముఖ్యంగా బంతి, మందార, మల్లె, ఎగ్జోరా, గ్లుమెరియా పూల మొక్కలు, నేరడు, జామ, దానిమ్మ, పనస తదితర పండ్ల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

వాడవాడలా 'స్వచ్ఛదనం-పచ్చదనం'


వారాసిగూడలో చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కందిశైలజ


శ్రీనివాసనగర్‌కాలనీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ


పారిశుధ్యంపై అవగాహనలో కార్పొరేటర్ సునీత

సికింద్రాబాద్ /కంటోన్మెంట్/సనత్‌నగర్ జోన్ బృందం ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో మంగళవారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, అర్బికల్చర్ విభాగాలు, ఇతర ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పలుచోట్ల మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఇంటింటికీ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

బౌద్ధనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : బౌద్ధనగర్ డివిజన్‌లో పారిశుధ్య పనులను సవ్యంగా చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ కంది శైలజ అధికారులకు సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వారాసిగూడలో పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికంగా ఉన్న చెత్తకుప్పలను సిబ్బందితో తొలగించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ఓమర్, అధికారులు చంద్రశేఖర్, గిరి నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం డివిజన్ పరిధిలో బ్రాహ్మణబస్తీ, శ్రీనివాస్‌నగర్, నాగులూరి నర్సింహ వీధిలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్‌తో పాటు వార్డు ఇన్‌చార్జి సంధ్యారాణి యూసీడీసీఓ ధనశ్రీ, ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.

చిలకలగూడ : పరిసరాలు పరిశుభ్రంగా వుండి, పారిశుధ్యం పాటిస్తే అంటువ్యాధులు ప్రబలవని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని దూద్‌బావి, మెట్టుగూడ తదితర ప్రాంతాలలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పాఠశాలలు, వైద్యశాలల ఆవరణలో విధిగా నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలని, దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.


డివిజన్‌లోని కూడలి వద్ద మొక్కలను నాటిన అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

రెజిమెంటల్‌బజార్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్పొరేటర్ కొంతం దీపిక అన్నారు. మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెజిమెంటల్‌బజార్‌లో ఉన్న పోస్ట్ ఆఫీస్ స్థలం శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...చెత్త డంపింగ్ ప్రాంతాలను నిర్మూలించడంతో పాటు మొక్కలు నాటడం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం లక్ష్యం అని అన్నారు. బస్తీవాసులు ఆహ్లాదకరమైన వాతావరణం కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం బస్తీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ గాయత్రీదేవి, శానిటేషన్ సూపర్‌వైజర్ నర్సింగ్ రావు, ఇన్‌చార్జి సుధీర్, జవాన్లు ప్రభాకర్, జహంగీర్, బాబురావు, బాలకృష్ణ, రేణులత, డేవిడ్, యాదయ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.


రెజిమెంటల్‌బజార్‌లో మొక్కలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు